క్లుప్తంగా

నందీశ్వరునికి విశేషపూజలు



పూజలందుకుంటున్న నందీశ్వరుడు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని నందీశ్వర స్వామికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచే గాక మహారాష్ట్ర, ఒడిస్సాల నుంచి 17 మంది భక్తులు పరోక్ష సేవగా నందీశ్వరునికి విశేష పూజలు నిర్వహించుకున్నారు. నందీశ్వరునికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికా గుండం లోని శుద్ధ జలంతో అభిషేకించారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యం



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆలయ దక్షిణ మాడవీధిలో నిత్యకళారాధన వేదికపై శుక్రవారం గుంటూరుకు చెందిన నటరాజ సంగీత నృత్య కళాశాల బృందం నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. వినాయక కౌత్వం, భోశంభో...శివశంభో, నమశ్శివాయతే, నమో భవాయ, శివ పంచాక్షరీ స్తోత్రం, శంకర శ్రీగిరి, నటరాజ స్తోత్రం, అయిగిరి నందిని, శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు రాజనందిని, నిత్య, మనోజ్ఞ, శ్రీవల్లి, లాస్యశ్రీ నృత్య ప్రదర్శన చేశారు.

సేవలతోనే గుర్తింపు



బ్రాంచ్ మేనేజర్‌ను సన్మానిస్తున్న నూతన మేనేజర్ సిబ్బంది

వెలుగోడు: ఖాతాదారులకు సేవలందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని కెనరా బ్యాంకు నూతన బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కెనరా బ్యాంక్ ప్రాంగణంలో ప్రస్తుత బ్రాంచ్ మేనేజర్ సూర్య దేవరనాయక్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ సూర్యదేవరనాయక్ రెండేళ్లలో మండల ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి ఆదరాభిమానాలు పొందారన్నారు. బదిలీపై వెళ్తున్న బ్రాంచ్ మేనేజర్ సూర్యదేవరనాయక్ మాట్లాడుతూ మండల ప్రజలు బ్యాంక్ అభివృద్ధికి, సిబ్బందికి సహకరించారన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ప్రవళిక, నాగరాజు, ఆసిఫ్ బాషా, మమ్మద్ హుస్సేన్, ఆచారి విజయ్ కుమార్, కాశయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

నందికొట్కూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. శుక్రవారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయా సమస్యలపై వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి దేవస్థానం, అయ్యలూరి గ్రామంలోని నీలకంటేశ్వర కోదండరామస్వామి దేవాలయాలకు నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్యనిర్వాహణ అధికారి వేణునాథరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు విజయవాడ దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు చెప్పారు. ఒక్కో దేవస్థానానికి 9 మంది సభ్యులకు మించకుండా పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా దేవదాయ శాఖ అధికారి రైతు నగరం, నంద్యాల కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- సమస్యలు లేవనెత్తిన ప్రజా ప్రతినిధులు
- పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్న అధికారులు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి,



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ తొగురు సరోజినీ వర్ణీనియ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. అధికారులు తమ శాఖ పరిధిలోని అంశాల గురించి వివరిస్తుండగా సమస్యలపై ప్రజా ప్రతినిధులు తమ గళం వినిపించారు.

- మన ఊరి నేస్తాల వారిచే కందులు, జొన్నలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, హమాలీల సమస్య ఉందని, దీంతో రైతులు తీవ్ర అవస్థలతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారని కోఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి సభ దృష్టికి తెచ్చారు. పాములపాడులో చెలిమిల్ల రస్తాలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణం చేపట్టాలని కోరారు.
- బానుముక్కల గ్రామంలో వీధి కుళాయిలకు సరఫరా అవుతున్న నీరు అపరిశుభ్రంగా ఉంటోందని, కొత్త ఫిల్టర్లు ఎప్పుడు ఏర్పాటు చేసి ప్రజలను జ్వరాల బాని పడకుండా చూడాలని మండల ఉపాధ్యక్షుడు బండ్లమూరి వెంకటేశ్వర్లు కోరారు.
- మిట్టకందాల గ్రామంలో కేవలం ఒక బోరు మాత్రమే పని చేస్తోందని, ఇస్కాల సమ్మర్ స్టోరేజ్ నుంచి నీటిని విడుదల చేయాలని సర్పంచు చింతల నారాయణ తెలిపారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా ఇంత వరకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయలేదని అధికారులకు విన్నవించారు.
- మద్దూరు గ్రామం నుంచి గుంతకందాల రహదారి గుంతల మయంగా ఉందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని ఎంపీటీసీ సభ్యుడు బషీరాహ్మద్ అధికారుల దృష్టికి తెచ్చారు.
- ఇస్కాల గ్రామంలో స్కూల్ వద్దకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని జేఎల్ఎంను కోరినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని సర్పంచు మౌలాలి అధికారులకు ఫిర్యాదు చేశారు.
- నేషనల్‌హైవే నిర్మాణంతో ఇప్పటికే భూములు ఇచ్చిన రైతులకు పొలాలకు వెళ్లేందుకు రహదారి సమస్య ఉందని ఎంపీటీసీలు, సర్పంచులు అధికారుల దృష్టికి తెచ్చారు. అధికారులు స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంఈఓ బాలాజీనాయక్, ఏఈలు ట్రాన్స్‌కో అబ్దుల్ అబీబ్, పీఆర్ రాఘవేంద్రప్రసాద్, కేసీసీ శ్రీనివాసనాయక్, హౌసింగ్ శ్రీనివాసులు, పశు వైద్యాధికారిణి సాయిలీల, ఉద్యానశాఖ అధికారిని హరిచందన, ఏసీడీపీఓ మంగవల్లి, ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీఓ అలివేలిమంగమ్మ పాల్గొన్నారు.

12 నుంచి ఆధార్ క్యాంపులు

కొత్తపల్లి: మండలంలో ఈనెల 12 నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మేరి శుక్రవారం తెలిపారు. 12న గువ్వలకుంట్ల, గుమ్మడాపురం, 13న కొత్తపల్లి, గుమ్మడాపురం, 14న నందికుంట శివపురం, 15న నందికుంట, గోకవరం గ్రామాల సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శుభకార్యం

వెలుగోడు: పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన బోయరేవుల గ్రామానికి చెందిన శంకెల పుల్లారెడ్డి కుమారుడు శివరామిరెడ్డి వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతరం అక్కడికి విచ్చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. శిల్పా వెంట శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు దేశం తిరుపెం రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, నాయకులు రమణారెడ్డి, రమణ ఉన్నారు.

- బండి ఆత్మకూరు: నంద్యాల ఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన లింగాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు సగిలే రాఘవరెడ్డి కుమార్తె చైతన్య వివాహానికి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీఓ స్వప్న

పాములపాడు: కిశోర బాలికలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని డీసీపీఓ స్వప్న అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటరులో కిశోరి వికాసం-వేసవి సెలవుల కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రిత్యా నేరమని, దీంతో ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ఏ ఇంట్లో నైనా 18 సంవత్సరాలు నిండని బాలికలకు వివాహం చేస్తున్నట్లు తెలిస్తే దగ్గర్లోని అంగన్‌వాడీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి వివరించారు. కిశోర బాలికల సాధికారత మనందరి బాధ్యత అని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ మంగవల్లి, జీఎంఎస్‌కే ప్రసన్నలక్ష్మి, సూపర్‌వైజర్లు లలిత ప్రభావతి, వెంకటేశ్వరమ్మ, ఏఎన్ఎం పుల్లమ్మ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు శివలక్ష్మి, నాగమణి, మద్దమ్మ, చెన్నమ్మ, నాగమద్దమ్మ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టినమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

జూపాడుబంగ్లా: భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని ఫలితాల ఆధారంగా భూమిలో ఎరువులు, విత్తనాలు వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం, నంద్యాల వ్యవసాయ అధికారిణి హేమలత, ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తంగడంచ గ్రామంలో రైతులకు భూసార పరీక్షలు-పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూమిలోని కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుము, కాపర్, మాంగనీస్, బోరాన్, ద్వితీయ పోషకాలు సల్ఫర్ భూమిలో ఎంత శాతం ఉందో తెలుసుకోవచ్చన్నారు. అనంతరం తక్కువ దిగుబడులు వస్తున్న రైతుల భూములు, పంటల దిగుబడి బాగున్న రైతుల భూముల్లో మట్టి నమూనాలు సేకరించారు. ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఆత్మకూరు: కార్మిక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, ఎన్‌జీఓ సంఘం తాలూకా సహాయ కార్యదర్శి రాజశేఖర్ కోరారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సీఐటీయూ రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేవిధంగా కొత్త లేబర్ కోడ్‌లను అమలు చేయడం సరికాదన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలనే పునరుద్ధరించాలన్నారు. అనంతరం సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, ఏపీ రైతుసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బాషా, వీరన్న, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు మల్లయ్య తదితరులు మాట్లాడారు.

కల్యాణం..కమనీయం



స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు శుక్రవారం కల్యాణం కమనీయంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపం వద్ద మహానందీశ్వరస్వామి దంపతులను కొలువుతీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

పల్లకీసేవ

ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ముందుగా గంగ, కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వారిని పల్లకీలో కొలువుతీర్చి పూజలు చేపట్టారు. అనంతరం పల్లకీ ఉత్సవాన్ని ఆలయ ప్రాకారాల్లో కనుల పండువగా జరిపారు.

భక్తజన సందడి

ఆలయ ఆవరణలో భక్తుల సందడి కొనసాగుతోంది. శుక్రవారం సుమారు 15కు పైగా పెళ్లిళ్లు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి జరిగిన అష్టవిధ మహామంగళ హారతుల సేవల్లో భక్తులు పాల్గొని పూజలు తిలకించారు.



కోనేరులో స్నానాలాచరిస్తున్న భక్తులు

ఏపీఎం, సీసీలను సస్పెండ్ చేయాలి

ఆత్మకూరు: బేతంచర్ల మండలం సిమెంట్‌నగర్ గ్రామ సచివాలయం వద్ద జరిగిన వీఓఏల నియామకం విషయంలో పొదుపులక్ష్మి గ్రూపు బుక్కులు రాసే వీఓఏలను, సీసీలను సస్పెండ్‌చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం డిమాండ్ చేశారు. సుదర్శన భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బేతంచర్ల మండలంలో పనిచేస్తున్న ఏపీఎం, సీసీలు పొదుపు సంఘాల సమావేశాలు నిర్వహించకుండా కొందరిని తొలగించడం అన్యాయమన్నారు. ఇందువల్ల వారిని తిరిగి నియమించాలని కోరారు. చట్టవిరుద్ధంగా పనులు చేస్తున్న బేతంచర్ల వెలుగు ఏపీఎం, సీసీలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా పొట్టకూటి కోసం పనిచేస్తున్న బుక్ కీపర్లను తొలగించడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు రజాక్, రామ్‌నాయక్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోండి

ఆత్మకూరు: తెల్ల రేషన్‌కార్డులో చేర్పులు, మార్పులు ఉంటే సిబ్బందితో చేయించుకోవాలని తహసీల్దార్ రత్నారాధిక తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ శనివారం నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుని, కొత్తగా పేర్లను నమోదు చేయించుకోవడం, రేషన్ కార్డుల నుంచి సభ్యులను తొలగించడం, రేషన్ కార్డులను సరెండర్ చేయడం, చిరునామా మార్చడం, రేషన్‌కార్డులో ఆధార్ సెంటర్ సీడింగ్ చేయడం తదితర అవకాశాలు ఉన్నాయన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కొత్తపల్లి: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అబ్దుల్ అబీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం కావడంతో మరమ్మతులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలపిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

'హుందాయ్' సహకారం గొప్పది



రెండో దశ చెంచుల సహాయ కార్యక్రమ బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్: కార్ల ఉత్పత్తి సంస్థ హుందాయ్ నల్లమల చెంచులకు అందిస్తున్న సహకారం గొప్పదని ఆర్‌డీఓ నాగజ్యోతి అన్నారు. శుక్రవారం హుందాయ్ ఐయోనిక్ ఫారెస్ట్ రెండో దశ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌డీఓ సంస్థ కార్యక్రమం నేమ్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో చెంచుల ఆర్థిక స్వావలంబన కోసం హుందాయ్ అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. కార్యక్రమంలో హుందాయ్ మోటార్ ఇండియా ఫౌండేషన్ ట్రస్టీ గోపాల్ కృష్ణన్, ఐటీడీఏ సహాయ పీఓ సురేష్ కుమార్, ఐటీడీఏ హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ధనంజయ, ఉద్యాన అధికారి చందన, ఐటీడీఏ ప్రత్యేక అధికారి గుండాల నాయక్ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: పత్రికా స్వేచ్ఛను హరించటం తగదని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు, అంబేద్కర్ యువజన నాయకుడు ఆర్ఎంపీ ఎర్రన్న తెలిపారు. ఎలాంటి సెర్చ్‌వారెంటు లేకుండా 'సాక్షి' పత్రిక ఎడిటర్ ఆర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు చొరబడి సోదాల పేరుతో భయాందోళనకు గురిచేయటాన్ని నిరసిస్తూ శుక్రవారం జూపాడుబంగ్లా 'సాక్షి' విలేకరి సి.నాగభూషణం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు, ఎర్రన్న మాట్లాడుతూ సమాజంలో నిజయాలను నిర్భంగా రాసే విలేకరులపై కేసులు బనాయించటం, కోర్టు నోటీసులివ్వటం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో తిరుపాలు, నారాయణ, గోవర్ధనయ్య, వెంకటేశ్వర్లు, అక్షర విలేకరి చంద్రశేఖర్, చిన్నమల్లయ్య, రజకసంక్షేమసంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ చిన్నారుల విద్యాబోధన, సంరక్షణలో బాధ్యతగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సునిల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని దేవనగర్, హరిజనవాడల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యా విషయాల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, కిశోర వికాసం కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

- ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు



నూతన ఆలయంలో సీతారామచంద్ర స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్టించిన దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని సింగరాజు పల్లె గ్రామంలో మూడవరోజు శుక్రవారం సీతారామచంద్ర స్వామి, కామాక్షీ సమేత కాశీ విశ్వనాథ స్వామి, పరివార దేవతల నాభిశిల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలికించేందుకు, స్వామివార్లను దర్శించుకునేందుకు మండలంలోని నలుమూల, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయంప్రభాత పూజ, గణపతి పూజ, విగ్రహాలకు, యంత్రాలకు అభిషేకం, కర్పూర హారతి, హస్తానక్షయుక్త మిధున లగ్నంలో యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, కక్షజ్వాల కూష్మాండ బలిప్రదానం, ప్రదాన దేవతా హోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం, మహా మంగళహారతి, అన్న శాంతి కార్యక్రమాలు శాస్త్రానుసారంగా, వేదపండితుల వేదమంత్రోశ్చరణల మధ్య అంగరంగ వైభవంగా విగ్రహప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం సీతారామ చంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం శాస్త్రోత్కంగా చేశారు. అదేవిధంగా రాత్రి కామాక్షీ సమేత కాశీ విశ్వనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తండ్రి బైరెడ్డి మల్లికార్జున రెడ్డి, నాగంపల్లి మాజీ సింగల్ విండో చైర్మన్ రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ, నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్‌బాషా, సర్పంచు మారెన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు కొటిరెడ్డి, అంకిరెడ్డి, పరమేశ్వరరెడ్డి భరత్ కుమార్, కుమ్మరి క్రిష్ణయ్య సుబ్బరాయుడు, క్రిష్ణారెడ్డి, సామిరెడ్డి, నారాయణరెడ్డి, మునిరంగ, రహంతుల్లా, నాగ ఎల్లయ్య, నాగన్న, సాయన్న, పెద్దసామి, వెంకటరెడ్డి గ్రామ నాయకులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం ప్రతిష్టిస్తున్న దృశ్యం

స్టాప్ వద్దకు రాని బస్సులు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



బానుముక్కల మలుపు వద్దకు వెళ్లకుండా హైవేపైనే వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు



మండుటెండలో హైవేపై దిగి రోడ్డు దాటుతున్న ప్రయాణికులు

పాములపాడు: మండలంలోని బానుముక్కల బస్ స్టాప్ వద్దకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు వెళ్లకుండా నేరుగా హైవేపై ప్రయాణికులను దించుతున్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఆత్మకూరు డిపోకు చెందిన ఏపీ21టీఏ 4099 నంబరు పల్లెవెలుగు బస్సు హైవేపై నిలిపి ప్రయాణికులను దించారు. వీరిలో ఒక వ్యక్తి కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. కొందరు మహిళలు చిన్నపిల్లలతో ఉన్నారు. మండుటెండలో వారి బాధ వర్ణనాతీతం. బస్సు వస్తుందని మలుపు వద్దే ఆత్మకూరుకు వెళ్లేందుకు వేచి ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆర్డినరీ బస్సులు కచ్చితంగా బానుముక్కల మలుపు బస్ స్టేషన్ వద్దకు వెళ్లి ప్రయాణికులను దించి, అక్కడ ఉన్న వారిని ఎక్కించుకోవాలని గతంలో ఆర్టీసీ అధికారులు తెలిపిన విషయం విదితమే. కానీ బస్సు డ్రైవర్, కండక్టర్ ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతోనే డ్రైవర్లు, కండక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నరసింహ నాయక్ ఉపాధి కూలీలకు సూచించారు. శుక్రవారం కరివేన గ్రామ పరిధిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి సమ్మెకు తరలిరావాలని కోరారు. వారి సమస్యలు తెలుసుకుని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే యోచనలో ఉందన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు టెంట్లు, పనిముట్లు, మెడికల్ కిట్లు అందించడం లేదన్నారు. న్యాయమైన డిమాండ్లు సాధించుకునేందుకు చేపడుతున్న సమ్మెలో కూలీలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కేయూపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మౌలాలి, వెంకటసుబ్బయ్య, దేవమ్మ, లింగస్వామి, శేఖర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.